
ఈనాడు
రాజన్న సిరిసిల్ల

నిర్లక్ష్యం పెరిగి.. భూగర్భ జలం తరిగి..

- ఇంకుడుగుంతల నిర్మాణాలపై పట్టింపు కరవు
- ఈసారైనా పురపాలికశాఖ ఉత్తర్వులు అమలయ్యేనా?



కరీంనగర్‌లోని నగరపాలిక పార్కులో నిర్మించిన ఇంకుడుగుంత

"ఈ ఏడాది వేసవిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నీటికి కటకట ఏర్పడింది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తుగా మేల్కొనే విధంగా చర్యలు తీసుకోవాలి."
- ఆరు నెలల కిందట రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్

నగరాలు, పట్టణాల్లో రోజురోజుకు జనాభా ఎక్కువవుతుండగా శివారు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లి పోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి.

ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికి.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు.

అనుమతులకే పరిమితం

ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ.2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు.

300ల చదరపు మీటర్లకు తప్పనిసరి

■ మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ■ ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి. ■ ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ■ వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వుల్లో వివరించారు.

■ కరీంనగర్ నగర పరిధిలో 300 చదరపు మీటర్లు ఉన్న భవనాలు 791 ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు.

■ ఇప్పటికే 458 బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు.

■ మిగతా 333 భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు.

■ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న రెండు వరుసల రహదారి

డివైడర్ తక్కువ ఎత్తులో నిర్మించిన ఫలితం



రోడ్డు ప్రమాదంలో తనువుచాలించిన తన కుమారుడు వేముల బాలు ఫొటో చూపిస్తున్న ఈమె పేరు వేముల రామవ్వ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామస్థురాలు. జులై 18న రాత్రి సొంత పని మీద బాలు తన ద్విచక్రవాహనంపై రాచర్ల గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తుండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను తగలడంతో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబ పోషణలో పెద్ద దిక్కుగా ఉండే యువకుడిని కోల్పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. మనవడు రియాన్స్ మనవరాలు స్నేహ్న తండ్రి లేని వారుగా మిగిలిపోయారు.

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు నిర్మించిన రెండు వరుసల రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు క్షతగాత్రులై ఆసుపత్రుల పాలవుతున్నారు. రోడ్డు నిర్మాణంలో అధికారులు నిబంధనలు తుంగలో తొక్కడమే ఇందుకు ప్రధాన కారణం. రోడ్డు నడుమ తక్కువ ఎత్తులో నిర్మించిన డివైడర్ వాహనదారులకు శాపంగా మారింది.

భారీ వ్యయం.. పనులు నామమాత్రం

ఎల్లారెడ్డిపేట మండలంలో రోడ్లు, భవనాల శాఖ నిధులు రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా విస్తరించారు.

■ మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు 4.4 కిలోమీటర్ల మేర విశాలమైన రహదారిని అన్ని హంగులతో తీర్చిదిద్దారు.

■ మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు మూడు అడుగుల ఎత్తులో నిర్మించాల్సిన డివైడర్‌ను కేవలం 9 ఇంచుల ఎత్తుకే పరిమితం చేశారు.

■ బస్టాండ్లు, ప్రధాన ప్రాంతాల్లో ఒకవైపు నుంచి మరోవైపునకు రోడ్డు దాటే ప్రాంతాల్లో (యూటర్న్) రబ్బర్ స్ట్రిప్స్, థర్మోప్లాస్టిక్ పెయింటింగ్‌తో పాటు సోలార్ బ్లింకర్లు వంటి ఏర్పాట్లను గాలికొదిలేశారు.

■ యూటర్న్ ప్రదేశాల్లో డివైడర్‌లో సుమారు 20 మీటర్ల దూరం వరకు చెట్లు ఉండకూడదని తెలిసినా పట్టించుకోలేదు.

■ ఎక్కడా వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయి. యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

■ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను విస్మరించడంతో అనతికాలంలోనే అక్కడక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు ఒక్కసారిగా గుంతల నుంచి వెళ్లగానే అదుపు తప్పుతున్నాయి.


రాచర్ల గొల్లపల్లి శివారులోని పెట్రోలు బంకు వద్ద డివైడర్‌ను తాకి పల్టీకొట్టిన వాహనం

■ పోలీసు రికార్డుల ప్రకారం 2023లో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. 2024లో ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 10 మంది గాయపడ్డారు. పోలీసు కేసులు నమోదు కానివి చాలా ఉన్నాయి. గడిచిన 21 నెలల్లో సుమారు 60 మంది వరకు గాయపడ్డారు. ఎన్నో వాహనాలు ధ్వంసమయ్యాయి.

రూ. 60 లక్షలతో ప్రతిపాదనలు



ఆర్అండ్‌బీ రెండు వరుసల రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వేగ నియంత్రణ ఏర్పాట్ల కోసం రూ. 60 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి రాచర్ల గొల్లపల్లి శివారు వరకు రెండు వరుసల రహదారిని నాణ్యతతో నిర్మించాం. రూ. 15 కోట్లు చాలక పోవడంతో డివైడర్ ఎత్తును పెంచలేకపోయాం. మరో రూ. 1.50 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించాం.
- కిరణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి వరకు డివైడర్‌లో యూటర్న్ ప్రాంతాలు ఎక్కువగా ఉండగా అక్కడ కొద్దిదూరం మేర చెట్లను తొలగింపజేశాం. బస్టాండ్లు, పెట్రోలు బంకులు తదితర ప్రధాన కూడళ్లలో స్టాపర్లను ఏర్పాటు చేశాం.
- రమాకాంత్, ఎస్సై, ఎల్లారెడ్డిపేట


పాఠశాల దారి ఇలా... వెళ్లేదెలా?



(కోనరావుపేట మండలం కనగర్తి జిల్లా పరిషత్ పాఠశాల గ్రామానికి అర కిలో మీటరు దూరంలో ఉంది. పాఠశాల చుట్టూ వరి, పత్తి పంట పొలాలు ఉన్నాయి. పాఠశాల దారి వ్యవసాయ క్షేత్రాల్లోని నీటితో రోజుల తరబడి బురదగా ఉంటుంది. వర్షాలకు వ్యవసాయ క్షేత్రాలు, లోతట్టు ప్రాంతంలోని వరద రావటంతో పాఠశాల దారి కోతకు గురైంది. విద్యార్థులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించటంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కోనరావుపేట

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి

వేములవాడ, న్యూస్‌టుడే: భూస్వామ్య పెత్తందారు వ్యవస్థకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేసిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద రజకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి వేడుకల్లో విప్ ముఖ్య అతిథిగా హాజరై ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, అణగారిన ప్రజల వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోఠిలోని మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టారని పేర్కొన్నారు. ఐలమ్మ మనవరాలిని బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులను, అమరులను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


వేములవాడలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్, అధికారులు, సిబ్బంది, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మండల విద్యాధికారులొచ్చారు

తగ్గనున్న పని భారం.. పెరగనున్న పర్యవేక్షణ

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇప్పటికే పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం ప్రకటించింది. పర్యవేక్షణ తగ్గి విద్యావ్యవస్థ కుంటుపడిందని గుర్తించిన ప్రభుత్వం ఈ పరిస్థితులను అధిగమించడానికి ప్రతి మండలానికి ఎంఈవోలను నియమించింది. ఆ మండలంలో పని చేసే సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వీరు బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన ఒక ఇన్‌ఛార్జి ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా, మిగిలిన ఇద్దరు ఎంఈవోలు రఘుపతి, బన్నాజీలు జిల్లాలోనే పని చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా ఎంఈవోలను నియమించడంతో పనిభారం తగ్గుతుందని ఎంఈవోలు చెబుతున్నారు.

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

జిల్లాలో ఇప్పటి వరకు ముగ్గురు ఎంఈవోలు ఉండగా, 13 మండలాల బాధ్యతలను వీరే చూస్తుండేవారు. పని భారంతో సతమతమవుతుండేవారు.

■ ఒక్కో ఎంఈవో 3 నుంచి 5 మండలాలను పర్యవేక్షించేవారు. దీంతో ఉపాధ్యాయులకు అవసరం ఉన్నప్పుడు ఎంఈవో ఎప్పుడు ఎక్కడ ఉన్నారో తెలియక ఇబ్బందులు పడేవారు.

■ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రతి మండలానికి ఎంఈవో రావడంతో ఇబ్బందులు తప్పనున్నాయి.

గతంలో ముగ్గురమే...

జిల్లాలో గతంలో ముగ్గురమే ఉండేవారం. ప్రస్తుతం మండలానికి ఒక గెజిటెడ్ ఉపాధ్యాయుడిని ఇన్‌ఛార్జి ఎంఈవోగా నియమించింది. దీంతో మాకు పని భారం తగ్గుతుంది. గతంలో ఒక్కొక్కరం 3 నుంచి 5 మండలాల బాధ్యతలు చూసేవారం. దీంతో పని భారం ఎక్కువగా ఉండేది. అన్ని మండలాలకు నియమించడంతో సమస్య తీరింది.
- దూస రఘుపతి, ఎంఈవో, సిరిసిల్ల

ప్రతి నెలా తనిఖీలు...

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రతి నెలా తనిఖీ చేయనున్నారు.

■ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు యూనిఫాం, పాఠ్య, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనంతో పాటు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడంతోపాటు పాఠశాలల్లో రికార్డులను పరిశీలించనున్నారు.

■ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పిల్లలకు వివిధ మేళాలు, పోటీలు నిర్వహించడం జరుగుతుంది.


వేములవాడలో నూతన ఎంఈవోకు సన్మానం

■ మండల ప్రజాపరిషత్ సమావేశాలకు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరై ఉన్నతాధికారులకు నివేదికలను పంపించనున్నారు.

■ ఎస్ఎంసీ సమావేశాలకు హాజరు కావడంతో పాటు ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేయనున్నారు.

■ క్లస్టర్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను సేకరించనున్నారు.

■ పాఠశాలల గ్రాంట్ల వినియోగంతో పాటు రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల సెలవుల వివరాలు తదితర రికార్డులను పరిశీలించనున్నారు.

ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు జరిగే శ్రీదేవి నవరాత్రోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో అమ్మవారికి మండపం నిర్మాణం, విగ్రహాలను శుభ్రం చేసే పనులకు గురువారం ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు.


ఉత్సవాలకు విగ్రహాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఉత్సవాలకు పక్కా ప్రణాళిక

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో రానున్న బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలను పక్కా ప్రణాళితో వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. గురువారం రాత్రి వేములవాడలోని రాజన్న ఆలయ అతిథి గృహంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి వేడుకల నిర్వహణపై ఆలయ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ వేడుకలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారీ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వేడుకలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆలయ ఈవో వినోద్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ, ఆలయ పండితులు ఉమేశ్ శర్మ, శరత్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో నేడు తక్షణ ప్రవేశాలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం శుక్రవారం స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రెహానా ఇష్రత్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీకామ్, ఎమ్‌బీజడ్‌సీ, ఎంపీసీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 27.09.2024 సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో హాజరు కావాలని ఆమె కోరారు.


పంటలకు తెగుళ్ల కాటు

పురుగు మందుల వినియోగంతో అన్నదాతలు కుదేలు

జిల్లా వ్యాప్తంగా వరిలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు, సుడిదోమ ఆశిస్తున్నాయి. వాతావరణంలో ఆకస్మికంగా వస్తున్న మార్పులతో ఈ తెగుళ్లు క్రమంగా వ్యాపిస్తుండటంతో రైతులు హడలెత్తిపోతున్నారు. పురుగు మందుల వినియోగానికి అధిక వ్యయం చేస్తున్నారు. క్రిమిసంహారక మందుల కొనుగోళ్లతో సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు ఆశాజనకంగా ఉన్నా ఒక్కసారిగా తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంటను బ్యాక్టీరియా ఎండు తెగులు, సుడిదోమ పీడిస్తుండగా పత్తి పంటను బ్యాక్టీరియా మచ్చ తెగులు, మెగ్నీషియం లోపం వేధిస్తున్నాయి.


పత్తి పంటపై బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు లక్షణాలు

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1,80,310
పత్తి	49,332
మొక్కజొన్న	1246.24
పెసర	56.26
కంది	439.8
ఇతర పంటలు	162.05

- జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో తెగులు ఉనికి బయటపడుతోంది. కొన్ని మండలాల్లో పంటలపై తెగుళ్ల ఉద్ధృతి ఎక్కువగా ఉంది.
- క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నా కొన్ని చోట్ల తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- ఆకుపచ్చగా ఉండాల్సిన పత్తి పంటలో ఆకులు, కాయలపై నలుపురంగు మచ్చలేర్పడుతుండగా వరి పైరు తెలుపు రంగును సంతరించుకుంటుంది. తెగుళ్ల నివారణ కోసం రైతులు ఇబ్బడిముబ్బడిగా పురుగుల మందులు పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.
- తెగుళ్ల ఉద్ధృతి తగ్గకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు సోకడంతో ఆకులు పసుపు వర్ణంలోకి మారి, క్రమంగా ఎండుగడ్డిలా ఎండిపోతోంది. ఈ బ్యాక్టీరియా అత్యంత ప్రభావం చూపుతుంది. దీనికి తోడు సుడిదోమ ఆనవాళ్లు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి.
- ప్రస్తుతం గాలిలో తేమశాతం ఎక్కువవుతుండటంతో ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది.


పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- బ్యాక్టీరియా మచ్చతెగులు వల్ల కాయలు పగలకుండా బిగుసుకుపోతున్నాయి. మెగ్నీషియం లోపంతో ఆకులపై ఇటుకపొడి రంగులేర్పడుతున్నాయి. క్రమేపీ ఆకులు ఎండిపోయి, రాలిపోతున్నాయి. దిగుబడి తగ్గిపోయే ప్రమాదం నెలకొంది.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

తెగుళ్లు సోకుతున్న ప్రస్తుత తరుణంలో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు యాంటీబయోటిక్ మందును ఏదైనా తెగుళ్ల మందుతో కలిపి వాడాలి. 1 మిల్లీలీటరు ప్రొపికొనజోల్, 1 మిల్లీలీటరు అజాక్సీస్ట్రోబిన్ మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ కనిపిస్తే 120 గ్రాముల పైమెట్రిజోన్ మందును ఎకరానికి పిచికారీ చేయాలి. పొలంలో గాలి, వెలుతురు ప్రసరించేలా తూర్పు, పడమర దిశల్లో పాయలు తీయాలి. నత్రజని వాడకం తగ్గించాలి. పత్తిలో బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 మిల్లీ లీటర్ల టెబుకొనజోల్, అజాక్సీ స్ట్రోబిన్ మిశ్రమ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మెగ్నీషియం లోపం నివారణకు 10 గ్రాముల నీటిలో కరిగే మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- అఫ్జల్‌బేగం, జిల్లా వ్యవసాయాధికారిణి



ఎలగందుల ఖిల్లా



వేములవాడ రాజన్న ఆలయం

రాజులు ఏలిన ప్రాంతాలు.. ప్రకృతి సోయగాలు

- ఉమ్మడి జిల్లాలో పలు చారిత్రక క్షేత్రాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

జలపాతాలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు.. ఉమ్మడి జిలా పర్యాటకుల మనసులను పులకరింపజేస్తాయి. యాత్రికులను ఆకట్టుకునే పుణ్యక్షేత్రాలు.. రాజులు పాలించిన ప్రాంతాలను ఇప్పటికీ వేలమంది సందర్శిస్తున్నారంటే వీటి ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు.. వసతులు కల్పిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక క్షేత్రాల విశేషాలు, వాటి అభివృద్ధి అనుకూలతలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రదేశం:
- ● నిర్మించినది
- ■ ప్రత్యేకత
- ✸ కల్పించాల్సిన సౌకర్యాలు

ఎలగందుల ఖిల్లా, కరీంనగర్ జిల్లా

● శాతవాహనులు. కోటి లింగాలను రాజధానిగా ప్రాంతీయ ఏడు రాజులు గోభద, నారన, కంవయస, సమగోప పాలనలో నిర్మితమైనట్లు లభ్యమైన నాణేలను బట్టి తెలుస్తుంది.

■ ఈ కోట శాతవాహనులతోపాటు బాదామి చాళుక్యుల (550-750) నుంచి ఆసఫ్‌జాహీల(1724-1948) కాలం వరకు పాలన కేంద్రంగా విరాజిల్లింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది.

✸ ఎలగందుల ఖిల్లా చారిత్రక ప్రాంతం కావడంతో ప్రభుత్వం 2014లో పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకే నిలిచిపోయింది. సామగ్రి దెబ్బతింది. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే గార్డెన్స్, పార్కులు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉంది. కోట గురించి ఈతరం వారికి తెలియజేసేలా తీర్చిదిద్దాలి.

కోటలు.. చరిత్రకు ఆనవాళ్లు



మొలంగూరు ఖిల్లా, కేశవపట్నం మండలం, కరీంనగర్ జిల్లా

● ప్రతాపరుద్రుని అధికారులలో ఒకరైన వొరగిరి మొగ్గరాజు దీనిని నిర్మించాడు.

■ దూద్ బావి బహుళ ప్రాచుర్యం

✸ గుట్టపైన, కింద కోనేరులు.. దూద్ బావి, శివాలయం, వీరభద్రాలయం, కోట బురుజులు, రాతి ద్వారాలు, కందకాలు, ఫిరంగులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి దూద్ బావిలోని నీరు ఏ కాలంలో అయినా పాల వలె తెల్లగా ఉంటాయి. ఈ నీరు ఆరోగ్యానికి మంచిదని అక్కడి గ్రామస్థులు తీసుకెళతారు.. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



రామగిరి ఖిల్లా, కమాన్‌పూర్ మండలం బేగంపేట, పెద్దపల్లి జిల్లా

● శాతవాహనులు నిర్మించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. వారు దీనిని రక్షణ కోటగా వినియోగించుకొని కోటి లింగాలను రాజధానిగా చేసుకొని పాలించారు.

■ శత్రుదుర్భేద్యమైన ఈ కోట అరుదైన శిల్పకళ, బురుజులకు నిలయం. కోట పరిసర ప్రాంతాల్లో వనమూలికల సంపత్తి, అరుదైన వృక్షాలున్నాయి.

✸ ఇక్కడ వనమూలికలు, అరుదైన వృక్షాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, ఆయుర్వేద నిపుణులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వస్తారు. ఈ కోటకు అన్ని రకాలు వసతులు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోనే సుందరమైన ప్రదేశంగా విరాజిల్లుతుంది. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు బొటానికల్ పర్యటన క్షేత్రంగా మారనుంది.

కరీంనగర్ మానేరు జలాశయం

సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కరీంనగర్‌లో మానేరు డ్యాం నిర్మాణం చేశారు. ఈ డ్యాంను ఆనుకొని ప్రభుత్వం ఉజ్వల, జింకల పార్కులు, హరిత హోటల్ నిర్మించారు.

✸ మానేరు డ్యాంపై నీడ వసతి, ఫుడ్ కోర్టులు పెరగాల్సిన అవసరముంది. కొదురుపాక మధ్య మానేరులోనూ వసతులు, సౌకర్యాలు పెంచితే బోటింగ్‌కు సందర్శకుల సంఖ్య పెరగనుంది. ఉజ్వల, జింకల పార్కులను మరింత ఆకర్షించేలా తీర్చిదిద్దాలి.

✦ హరిత హోటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇస్కాన్ టెంపుల్, తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన ప్రాంతాలను తీర్చిదిద్దితే జిల్లాలో పర్యాటకులు పెరగనున్నారు. కోటి రూపాయాలతో తయారైన క్రూజ్ పడవను త్వరలో నడిపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవాలయం

● పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు రాజరాజేశ్వర దేవాలయం నిర్మించాడని శిలాశాసనం ద్వారా తెలుస్తుంది.

■ దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడి దర్శనానికి వస్తుంటారు.

✸ ప్రసాద్ లాంటి కేంద్ర పథకాలు వేములవాడతో పాటు కొండగట్టు, ధర్మపురి, ఇల్లందకుంట దేవాలయాలకు వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి. రవాణా పరంగా రైల్వేలైన్ వేయాల్సి ఉంది.



గోదావరిఖని గనులు

సహజ నిక్షేపాలుగా బొగ్గు గనులు బయటపడ్డాయి.

■ భూగర్భ గనుల తవ్వకాలు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పనులతోపాటు పవర్ ప్లాంట్‌లు ఉన్నాయి.

✸ గతంలో ఆర్టీసీ, మైనింగ్ సంస్థలు కలిసి పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించారు. బస్సు సర్వీసు ద్వారా తీసుకొచ్చి ఖనిలో జరుగుతున్న బొగ్గు గనుల తవ్వకాలు, ఈ ప్రాంత విశేషాలు చూపించేవారు. అనంతరం నిలిపివేశారు. పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన

- ఉమ్మడి జిల్లాలో 228 మందికి 61 పేర్లతోనే జాబితా
- 2008 డీఎస్సీ బాధితులకు ఒప్పంద ఉద్యోగాల తీరు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యా విభాగం

సర్కారు కొలువే లక్ష్యంగా చదివిన వారి ఆశలపై చివరి నిమిషంలో ప్రభుత్వ నిర్ణయం నీళ్లు చల్లింది.. న్యాయం కోసం పోరాడిన వారికి అనుకూలంగా కోర్టులు తీర్పునిచ్చాయి.. ఇది పదహారేళ్ల కిందటి మాట.. బాధితులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా అర్హుల జాబితా తప్పుల తడకగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది..

2008 డీఎస్సీలో అర్హత సాధించినా ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఉంచిన ఉమ్మడి జిల్లా జాబితాలో చాలా తక్కువ మంది పేర్లుండగా, అందులో అసలైన బాధితుల వివరాలు లేవు.

బాధితులు 228 మంది

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2008 డీఎస్సీలో 970 ఎస్జీటీ పోస్టుల భర్తీ చేపట్టగా రెండేళ్ల అనంతరం ఫలితాలు వెల్లడించారు. 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో దాదాపు 228 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఆనందాన్నిచ్చినా వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితాలో కేవలం 61 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. వాళ్లు కూడా అప్పట్లో రెండు ఉద్యోగాలకు పరీక్ష రాసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారే. 16 ఏళ్ల తర్వాత కొలువు దక్కబోతుందన్న బాధితుల సంతోషం జాబితా చూడగానే నీరుగారిపోయింది. రెండు రోజుల కిందట ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బాధితులు డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జాబితా రూపకల్పనలో జిల్లా అధికారుల తప్పిదం రాష్ట్ర విద్యాశాఖకు తెలియడంతో గురువారం వెబ్‌సైట్ నుంచి దాన్ని తొలగించారు.



జాబితాలో పేర్లు లేవని డీఈవో కార్యాలయానికి వచ్చిన 2008 డీఎస్సీ బాధితులు

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించిన సందర్భంగా చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ చేసిన వారికి ప్రభుత్వం కేటాయించింది. ఈ నిర్ణయంతో మార్కుల పరంగా ముందున్న ఎంతో మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ పోరాటం చేస్తూనే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు వీరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ అధికారంలోకి రావడంతో ఒప్పంద విధానంలో నియామకానికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి అక్టోబరు 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన, తదుపరి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. బాధితులు పూర్తి వివరాలు నింపి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం తీసుకునేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేయాలని సూచించింది.

ఇప్పటికైనా న్యాయం చేయాలి

-టి.స్నేహ, అభ్యర్థిని



2008 డీఎస్సీలో అర్హత సాధించినా అధికారుల నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయాం. విద్యాశాఖ రూపొందించిన జాబితాలో మా పేర్లే లేవు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలి.

జాబితాను సరిచేయండి

-ఎస్.జలపతిరెడ్డి, అభ్యర్థి



చాలా ఏళ్ల తర్వాత ఒప్పంద ఉద్యోగమైనా దక్కుతుందని సంతోషించా. డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థుల పేర్లు జాబితాలో లేవు. అసలే ఆలస్యం, ఆపై ఇలా చేయడం సరికాదు. జాబితాను సరిచేయాలి.

వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

-జనార్దన్‌రావు, కరీంనగర్ డీఈవో

వెరిఫికేషన్ కోసం వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితా గతంలో పంపించింది. అందులో తప్పిదాలుంటే పరిశీలన బృందంతో తనిఖీ చేయిస్తాం. నష్టపోయిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వెబ్‌సైట్ నుంచి జాబితా తొలగించిన విషయం నాకు తెలియదు.

శుక్రవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ముగిసిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండో స్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా దక్కించుకుంది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

29న కొండగట్టులో బ్రాహ్మణ సంఘం చర్చాగోష్ఠి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అంశాలపై చర్చించేందుకు ఈ నెల 29న కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో చర్చాగోష్ఠి నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఉజ్వల, రిసార్ట్ అధినేత మర్రిపల్లి కొండల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు ముఖ్య అర్చకులు, అతిథులు హాజరవుతారన్నారు. వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులు 73821 71021, 90595 50280 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

కరీంనగర్ కొత్తపల్లి: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా పోరాట కార్యక్రమంలో భాగంగా 28న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి తెలిపారు. గురువారం కొత్తపల్లి మండలం చింతకుంట తదితర గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో మారిన పని వేళలతో స్టడీ అవర్స్ తర్వాత రాత్రి 9.00 గంటలకు ఇళ్లు చేరడానికి మహిళా ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారన్నారు.

శ్రీరామసాగర్‌కు 1.09 లక్షల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మరోసారి భారీగా వరద వచ్చిచేరుతోంది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 22 స్పిల్‌వే గేట్లద్వారా 81,224 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 19 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది. అధికంగా నీటిని విడుదల చేస్తున్నందున గోదావరి నది, వరదకాలువ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు స్వాహా

ధర్మపురి, న్యూస్‌టుడే: ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం గురువారం ధర్మపురిలో వెలుగు చూసింది. స్థానిక ఎస్సై మహేష్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్శితుడయ్యాడు. ఈ క్రమంలో ట్రేడింగ్ ఇన్వెస్టుమెంటు యాప్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నాడు. మొదట కొంత నగదు తన బ్యాంకు ఖాతాలోకి జమ కావడంతో.. మరో ట్రేడింగ్ యాప్‌లో తనకు సంబంధించిన పాన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను నమోదు చేసి.. అన్నింటికీ అనుమతిలిచ్చాడు. దీంతో వెంటవెంటనే తన ఖాతాలో నుంచి రూ.4.45 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సాయి కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు అలవాటు పడి తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కిందట అతని భార్య, బాబుతో పాటు అమ్మగారికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందులు, భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంటి ముందు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు కొనివ్వలేదని మనస్తాపంతో..

జగిత్యాల గ్రామీణం: కారు కొనివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగిత్యాల గ్రామీణ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన బేతపు వంశీ(20) కారు కొనివ్వాలని తండ్రి రాజలింగయ్యను కొన్ని రోజులుగా అడుగుతున్నాడు. తండ్రి కొనివ్వకపోవటంతో లక్ష్మీపూర్ గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని అయిదు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్యాలతో మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో రాణింపు

ఆధునికత వైపు అతివల పయనం

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులంటేనే అద్భుతమైన కళానైపుణ్యం ఉండాలి. తమ అభిరుచికి తోడు ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచనలు చేస్తేనే ఈ రంగంలో రాణింపు సాధ్యం. ఒకప్పుడు చేనేత మగ్గాలపైన కనిపించే మహిళలు నేడు మరమగ్గాల వైపు అడుగులు వేస్తున్నారు. వస్త్రోత్పత్తుల్లో వస్తున్న ఆధునికతను సైతం అందిపుచ్చుకుంటున్నారు. కుటుంబ పోషణకు ఉపాధిగా మార్చుకున్నారు. ఆ ఆత్మవిశ్వాసం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. మగవారికి దీటుగా మరమగ్గాలను నడిపిస్తున్నారు. ఓవైపు ఇంటి బాధ్యతలు చూస్తూనే కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ పలువురికి స్ఫూర్తినిస్తున్నారు సిరిసిల్లకు చెందిన మహిళలు.

సిరిసిల్లలో దశాబ్దాల క్రితమే మరమగ్గాల వస్త్రపరిశ్రమ వేళ్లూనుకుంది. పురాతనమైన మగ్గాలపై ఒకే రకమైన ఉత్పత్తులకు పరిమితమవడం వల్ల ఇక్కడి పరిశ్రమ తరచూ సంక్షోభంలోకి వెళ్తుంది. తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న నేతన్నలు ఇప్పుడిప్పుడే బహిరంగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు.

- వివిధ రకాల వస్త్రోత్పత్తులను ఉత్పత్తి చేస్తూ మార్కెట్‌లోనూ తమకంటూ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నేతన్నలకు ఆయా కుటుంబాల్లోని మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు.
- కాలక్షేపానికి నేర్చుకున్న కళ ఇప్పుడు వారికి అదే వృత్తిగా మారింది.
- సాధారణ మరమగ్గాలపైనే కాకుండా డాబీ, జకార్డులు అమర్చిన వాటిపైన వస్త్రోత్పత్తుల్లోనూ తమ నైపుణ్యంతో రాణిస్తున్నారు.
- పట్టణంలో శాంతినగర్, రాజీవ్‌నగర్, అంబికానగర్, బీవైనగర్‌లోని చాలా ఇళ్లలోని కార్ఖానాల్లో మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నేస్తున్న మహిళలు కనిపిస్తున్నారు. వీరు బీములు పోయడం మినహా మిగతా అన్ని పనులు చేస్తున్నారు. వస్త్రాలకు డిజైన్లు వేయడం, కండెలు చుట్టడం, టాకాలు వేయడం వంటి పనులు చేస్తున్నారు.



ఎలక్ట్రానిక్ జకార్డు అమర్చిన మరమగ్గంపై వస్త్రోత్పత్తులు

పిల్లల ఉన్నత చదువులకు...



పిల్లలు ఉన్నత చదువులు చదువుతామని పట్టుబట్టారు. కొడుకు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, కూతురు ఇంటర్ రెండో సంవత్సరం. వారి చదువుకు అప్పులు చేయడం కంటే చిన్నప్పటి నుంచి తెలిసిన పని కావడంతో మరమగ్గాలు నడిపించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త కొత్త డిజైన్లు తయారు చేస్తుంటారు. వాటికి తగ్గట్టుగా చీరలు, పంచెలు వంటివి నేస్తున్నాను. నాతోపాటు మరో ఇద్దరికి పని కల్పిస్తున్నాను. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. **- సామల వాణి, అంబికానగర్**

ఆర్థికంగా నిలదొక్కుకోవాలని...



బీడీలు చుడుతూ ఖాళీ సమయంలో భర్తతో కలిసి అప్పుడప్పుడు మరమగ్గాలు నడపడం నేర్చుకున్నా. బీడీల పని నెలలో పదిహేను రోజులు కూడా రావడం లేదు. పిల్లలు పెద్దవాళ్లు అవుతుండటంతో ఖర్చులు పెరుగుతూ వస్తున్నాయి. అప్పులు చేసి అగాధంలో పడే కంటే భార్యాభర్తలం ఇద్దరం ఇంట్లోనే వచ్చిన పని చేస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆర్డర్లతోపాటు వివిధ రకాల ప్రైవేటు ఆర్డర్లు దోమ తెరలు, గ్రే కలర్ పాలిస్టర్ కూడా తీసుకుంటున్నాం. **- బిల్ల అత, రాజీవ్‌నగర్**

గుర్తింపు లభించింది



మరమగ్గాలు నడపడం, వస్త్రోత్పత్తులపై నా భర్త తర్ఫీదు ఇచ్చారు. ఉదయం ఇంటి పనులు పూర్తయ్యాక కార్ఖానాలో మరమగ్గాలు నడుపుతాను. రాత్రి సమయంలో ఆయన చూసుకుంటారు. బతుకమ్మ చీరల సమయంలో పెట్టుబడులకు ఇబ్బంది కాకుండా, కార్మికుల కొరతను అధిగమించేందుకు మేమే నడుపుకున్నాం. 2023లో చేనేత, జౌళిశాఖ ఉత్తమ మహిళా కార్మికురాలిగా గుర్తించింది. నాలా చాలా కుటుంబాల్లోని గృహిణులు మరమగ్గాలు నడుపుతూ చేదోడు వాదోడుగా ఉంటున్నారు. **- వనం సంధ్య, రాజీవ్‌నగర్**

వాటర్ ట్యాంకు ఎక్కిన మాజీ రేషన్ డీలర్లు

పెట్రోల్ సీసాలతో నిరసన



సిరిసిల్లలోని సాయినగర్‌లో వాటర్ ట్యాంకు ఎక్కిన మాజీ రేషన్ డీలర్లు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ రేషన్ డీలర్లు తమ రేషన్ దుకాణాలను తమకే కేటాయించాలని కోరుతూ సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో వాటర్ ట్యాంకు ఎక్కి పెట్రోల్ సీసాలతో గురువారం నిరసన తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గం వ్యాప్తంగా ఇటీవల 58 రేషన్ డీలర్ల నియామకానికి అధికారులు రాత పరీక్ష నిర్వహించారు. అర్హులైన వారికి ప్రొసీడింగ్‌లు సైతం అందజేశారు. రేషన్ డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని, వాటిని రద్దు చేసి, తమ రేషన్ దుకాణాలను తమకే కేటాయించాలని 15 మంది మాజీ రేషన్ డీలర్లు వాటర్ ట్యాంకుపై నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ సీఐ కృష్ణ వెళ్లి వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. పోలీసులు ట్యాంకు పైకి వస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళనకారులు హెచ్చరించారు. కలెక్టర్ రావాలంటూ వారు ఆందోళన చేయగా తహసీల్దార్ షరీఫ్ హమ్మద్ సంఘటన స్థలానికి చేరుకొని వారితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనివ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్లలోని ఆర్డీవో కార్యాలయంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. ఇటీవల నిర్వహించిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియలో పలు అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రభాకర్ నేతృత్వంలోని అధికారులతో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారులు ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. రేషన్ డీలర్ల ఖాళీలు, నోటిఫికేషన్, వచ్చిన దరఖాస్తులు, పరీక్షల నిర్వహణ విధానం, ఇంటర్వ్యూల విధానాన్ని పరిశీలించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. పత్రాలను పరిశీలించాలని రాగా, ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో మరో రోజు వస్తామని తిరిగి వెళ్లిపోయారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, రోగ నిర్ధారణ పరీక్షల తీరు, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును అనుసరించాలని సూచించారు. జనరేటర్ షెడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల చెల్లింపుపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పిల్లల వైద్యుడిని నియమించాలని బాలింతలు, ఆసుపత్రి సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయనను వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు బాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డును పరిశీలిస్తున్న డాక్టర్ పెంచలయ్య

పోత్గల్ పీహెచ్‌సీ...

పోత్గల్ (ముస్తాబాద్): ముస్తాబాద్ మండలం పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి వసంతరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్యాధికారి బత్తుల గీతాంజలిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీసీజీ వ్యాక్సిన్ కోసం ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు విధానాల పరిశీలన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామ ఆదర్శ పరస్పర సహకార సంఘం రైతులు ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో పంట క్షేత్రాలను గురువారం సందర్శించారు. పసుపు, మొక్కజొన్న, వేరుశెనగ, వరి పంటలు పరిశీలించారు. ఇక్కడి సాగు విధానాలు, మెలకువలు తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు వాడకం, బిందు సేద్యం పద్ధతిలో పంటలు పండిస్తున్నామని స్థానిక రైతులు వివరించారు. కార్యక్రమంలో గురడిరెడ్డి సంఘం అధ్యక్షుడు చిన్న అనంతు, కార్యదర్శి ఆలూర్ నారాయణరెడ్డి, కె.కె.భాజన్న, రైతులు దీవరావు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌ను కక్షిదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 28న కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ తగాదాలు, చెక్ బౌన్స్, గృహహింస కేసుల్లో రాజీ పడవచ్చని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

మూలవాగు చెరువు...

చేపల పెంపకం బాగు

100 మంది మత్స్యకారులకు ఉపాధి

న్యూస్‌టుడే, కోనరావుపేట

మూలవాగు చెరువు రైతులతో పాటు మత్స్యకారులకు వరప్రదాయినిగా మారింది. 250 ఎకరాల పైగా విస్తీర్ణంలో ఉన్న దీనిలో ఏడాదంతా నీరు సమృద్ధిగా ఉంటుంది. దీంతో చేపల పెంపకానికి అనుకూలంగా మారింది. మత్స్యకారులు చేపలు పెంచుతూ ఏడాది అంతా ఆదాయం పొందుతూ జీవనం సాగిస్తున్నారు.


కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు చెరువు కుడి, ఎడమ కాలువల ద్వారా 2,500 ఎకరాలకు సాగు నీరు అందగా, మత్స్యకారుల ఉపాధికి ఆధారంగా మారింది.

- నిమ్మపల్లిలోని ముదిరాజ్, బెస్త, గిరిజన మూడు సామాజిక వర్గాలకు చెందిన వారు కలిసి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నారు.
- సంఘంలో 130 మందికి సభ్యత్వం ఉండగా 100 మంది పైగా చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు.
- చేపలను మండలంతోపాటు సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. ఏడాదికి రూ.15 లక్షల పైగా ఆదాయం పొందుతున్నారు. తద్వారా మత్స్యకారులు స్వయం సమృద్ధి సాధిస్తున్నారు.



నిమ్మపల్లి మూలవాగు చెరువు వద్ద చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

సకాలంలో చేప పిల్లలు అందించాలి



గత ఏడాది జూన్, జులై నెలల్లో వర్షాలు కురవగానే ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడంతో చెరువులో వదిలాం. చేపల పెంపకానికి కావాల్సిన సమయం లభించటంతో పెద్ద సైజులో పెరిగి దిగుబడి అధికంగా వచ్చింది. ఈ ఏడాది ఇంకా పంపిణీ చేయలేదు. దీనివల్ల దిగుబడిపై ప్రభావం పడనున్నది. చెరువులో చేపలు పట్టడానికి అధునాతన తెప్పలు, వలలు అందిస్తే సౌకర్యంగా ఉంటుంది. తెప్పలు, వలలు తరచూ మరమ్మతుకు గురికావటంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.

- ఇస్లావత్ రవినాయక్, మత్స్యకారుడు, నిమ్మపల్లి

ప్రమాద బీమా వర్తింపజేయాలి



మత్స్యకారులు చేపలు పట్టే సమయంలో చెరువులో ప్రమాదానికి గురైతే కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రమాద బీమా రూ.5 లక్షలు వర్తింపజేయాలి. ప్రమాదాలు జరిగితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలి. చేపల విక్రయానికి మార్కెట్ సదుపాయం, భద్రపరచడానికి కావాల్సిన అధునాతన పరికరాలు అందించి మరింత తోడ్పాటు అందించాలి.

- చీకటి దేవయ్య, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు

నేర వార్తలు

ముగ్గురు రౌడీ షీటర్లకు జైలు, జరిమానా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు జడ్జి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన అంచ రాంరెడ్డికి, అదే గ్రామానికి చెందిన వివిధ కేసుల్లో ఉన్న రౌడీ షీటర్లు కట్కూరి స్వామి, గంగుల శ్రీనివాస్, చింత శేఖర్‌లకు బావి విషయంలో తరచూ గొడవలు జరిగాయి. ముగ్గురు రౌడీషీటర్లు రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశంతో కర్రతో దాడి చేశారు. దీంతో రాంరెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ముగ్గురికి 3 సంవత్సరాల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

ధర్మపురి, న్యూస్‌టుడే: గోదావరిలో ప్రమాదవశాత్తు జారిపడి భూలక్ష్మి(67) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన భూలక్ష్మి తరచూ ధర్మపురిలోని గోదావరిలో స్నానానికి వెళుతుండేవారు. ఎప్పటిలాగే గురువారం వెళ్లిన భూలక్ష్మి ప్రమాదవశాత్తు నదిలో పడి మృతిచెందారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం అపహరణ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరిధిలోని కిష్టంపల్లిలో మల్లేశ్‌యాదవ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోకలిబండతో తాళాలు పగులకొట్టారు. లోనికి ప్రవేశించి, బీరువాను ధ్వంసం చేశారు. కిషన్‌దాస్‌పేటలో కృష్ణ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులను ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలరాజుయాదవ్ పరామర్శించారు.



వేములవాడలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, భారాస నాయకులు, రజకులు



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కేటీఆర్ తదితరులు



జిల్లా పోలీస్ కార్యాలయంలో...



చిన్నబోనాలలో...

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

జిల్లాలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, రజక సంఘాల నేతలు, తదితరులు ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆమె సేవలను కొనియాడారు. **- న్యూస్‌టుడే బృందం**



కోనరావుపేటలో...



రుద్రంగిలో...



ఆవునూర్‌లో..



ఎల్లారెడ్డిపేట: జూనియర్ కళాశాలలో...



17వ పోలీస్ బెటాలియన్‌లో...



సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లిలో...



ముస్తాబాద్‌లో...



వీర్నపల్లిలో...



మల్లారంలో...

వడ్డేపల్లి మరణం సాహితీలోకానికి తీరని లోటు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ మరణం సాహితీలోకానికి తీరని లోటని సిరిసిల్ల సాహితీ సమితి అధ్యక్షుడు జనపాల శంకరయ్య పేర్కొన్నారు. సిరిసిల్లలో సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో వడ్డేపల్లి కృష్ణ సంతాప సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ వడ్డేపల్లి కృష్ణ సాహిత్యరంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, ఏనుగుల ఎల్లయ్య, అంజనా దేవి, బూర దేవానందం, దామోదరం, వంశీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

స్వగ్రామంలో వైద్యసేవలు అందించడం అభినందనీయం

కొదురుపాక(బోయినపల్లి): తల్లిదండ్రుల పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో నేత్ర వైద్యుడు వైరాగ్యం రాజలింగం తన తల్లిదండ్రుల పేరుపై ఏర్పాటు చేసిన బుచ్చమ్మ చంద్రమౌళి ఛారిటబుల్ ట్రస్టు కంటి ఆసుపత్రిని కేటీఆర్ గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. వైద్యసేవలను వైద్యుడు రాజలింగం కేటీఆర్‌కు వివరించారు. వైద్యురాలు రీటా, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, జోగినపల్లి సంపత్‌రావు, శ్రీనివాస్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



రాజలింగం దంపతులతో కేటీఆర్, నాయకులు

మహిళలు, విద్యార్థినులను వేధిస్తే చర్యలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ చంద్రయ్య హెచ్చరించారు. గురువారం సిరిసిల్లలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళలు, బాలికలు, విద్యార్థినులను వేధిస్తున్న 22 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసుశాఖ పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మహిళలు, బాలికలు, విద్యార్థినులను వేధించిన వారిపై 37 కేసులు, 40 పెట్టీ కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, కానిస్టేబుల్ ప్రియాంక పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

సంక్షిప్తం

విద్యార్థులందరిపై దృష్టి సారించాలి

కోనరావుపేట, న్యూస్‌టుడే: విద్యార్థులందరిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల విద్యాధికారి మురళీ నాయక్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ఏగ్లాస్‌పూర్, కొండాపూర్ తదితర పాఠశాలలను ఎంఈవో గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను, మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. తరగతి గదులలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఆదేశించారు.

28న రుద్రంగిలో మెగా ఉద్యోగ మేళా

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని రెడ్డీస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు చెందిన పలు కంపెనీలకు అర్హులైన వారిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.

స్థానికులకు రేషన్ దుకాణాలు కేటాయించాలి

సిరిసిల్ల కలెక్టరేట్: సిరిసిల్లలో విలీనమైన రగుడు, చంద్రంపేట, చిన్నబోనాల, ముష్టిపల్లి, పెద్దూరు, సర్దాపూర్‌లలోని రేషన్ దుకాణాలను స్థానికులకు కాకుండా సిరిసిల్ల పట్టణంలోని వారికి కేటాయిస్తుండటాన్ని వ్యతిరేకిస్తున్నామని విలీన గ్రామాల నాయకులు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలీన గ్రామాల నాయకులు పోచవేని ఎల్లయ్య, పాతూరి రాజిరెడ్డి, బుర్ర మల్లికార్జున్ గౌడ్, ఒగ్గు రాజేశం, ఎరవెల్లి రమణారావు, నర్మెట ప్రభుదాస్, ఎల్లం పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలి

సిరిసిల్ల అర్బన్: ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన నిత్య జాతీయ పతాకావిష్కరణ 75వ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కనకశ్రీ విజయ రఘునందన్, అధ్యాపకులు శ్రీధర్, వెంకటేశ్, వివేకానంద్, కనకయ్య, రాజయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, శ్రీనివాస్, నవీన్, సరోజ, విజయ, సుజిత, నర్మద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల వేధింపులు సరికాదు

వీర్నపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారుల వేధింపులను ఆపాలని కోరుతూ వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అదనపు పనుల పేరిట కార్యదర్శులపై అజమాయిషీ సరికాదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు జమ కాకపోవడంతో సొంత జీతాన్ని పల్లెల నిర్వహణకు వినియోగిస్తున్నామని వాపోయారు. నల్లగొండ జిల్లాలో పంచాయతీ కార్యదర్శిపై ఆ జిల్లా కలెక్టర్ వ్యక్తిగత కారణాలతో చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. బేషరతుగా చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, పురుషోత్తం, స్రవంతి, నీత, సుష్మా, వెన్నెల, ఉస్మాన్, శంకర్, సాయికుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బోయినపల్లి: నీలోజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎర్ర లింగారెడ్డి అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందడంతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. లింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లింగారెడ్డి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. లింగారెడ్డి కూతుళ్ల చదువు బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ జోగినపల్లి వెంకట్రామారావు, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, డైరెక్టర్ అనుముల హరికృష్ణ, బాలగోని వెంకటేశ్వర్లు, యుజవన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగుల వంశీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కోనరావుపేట: కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రిన్సిపల్ కేదారేశ్వర్, అధ్యాపకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాలలో 300 మంది పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రహరీ లేక ఆవరణలో పశువులు, శునకాలు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. శుద్ధజల యంత్రం మరమ్మతుకు గురై ఏడాది అయిందని వివరించారు. ప్రయోగశాలలకు సరిపడా బల్లలు, చదువుకోవటానికి డ్యూయల్ డెస్క్‌లు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

బోయినపల్లి: తడగొండలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బావమరిది కొదురుపాకకు చెందిన జోగినపల్లి శ్రీనివాస్‌రావు రూ.లక్ష విరాళాన్ని గురువారం అందించారు. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన శ్రీనివాస్‌రావును స్థానికులు అభినందించారు.